*ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన కథ* **(18.11.77)**

# కలకాలం నిలిచేది

**మా**ధవరావు రామన్నగూడెంలో బస్సు దిగేసరికి సాయంత్రం నాలుగయింది. చుట్టూ కలయజూశాడు. ఊరు చాలామారింది. మారదూ మరి! తానా వూరొచ్చి ఒకటా రెండా... ఇరవయ్యేళ్ళు దాటిపోయింది. ఇంతకాలం తాను రావల్సిన అవసరం లేకపోయింది. ఆ 'మామిడితోట' వ్యవహారమంతా మామయ్యే చూసుకొనేవాడు.

"పోనీ ఓసారి నువ్వెళ్లిరారా!" అంటూండేవాడు మామయ్య. పని వుందని తప్పించుకొనేవాడే కాని.. తనకీ వూరు రావాలంటే ఏదో భయంగా ఉండేది. ఎంతో బాధగా ఉండేది. ఇప్పుడు మామయ్య లేడు. తనకు రాక తప్పలేదు.

తీరా బస్సు దిగాక ఊళ్ళోకి వెళ్ళటానికి కాళ్లాడటంలేదు. గుండెలు దడదడలాడుతున్నాయి. ఏదో భయం. ఎంతో బాధ.

రాధని చూడాల్సి వస్తుందని భయపడటానికి ఆమె ఇప్పుడక్కడ లేదు. రాధ కన్యాయం చేసానని తన్నెవరయినా నిందించటానికి ఆ సంగతి ఎవ్వరికీ తెలియనే తెలియదు. అయినా అతన్ని రాధ స్మృతులు భయపెడుతున్నాయి. గతం బాధ పెడుతోంది.

"ఎక్కడికి వెళ్ళాలి బాబుగారూ!" అని రిక్షావాడడిగేసరికి స్పృహలోకి వచ్చాడు మాధవరావు.

ఓహో! ఇప్పుడూళ్ళో రిక్షాలు కూడా ఉన్నాయన్నమాట!.. రిక్షా యెక్కి "పూజారి కామయ్య గారింటికి పోనియ్!" అన్నాడు. రిక్షా కదిలింది.

ఇరవయ్యేళ్ళ క్రితం ఈ వీధులన్నీ మట్టిమయం. చినుకు పడితే బురద. ఇప్పుడు? కంకరరోడ్డు. రిక్షా చకచకా పరిగెత్తిపోతోంది.

తాతయ్యగారి వీధిలోకి రిక్షా తిరిగింది... అదిగో! అదే బుచ్చిబాబుగారి పెంకుటిల్లు. చిత్రం! ఇప్పటికీ ఆ ఇల్లు చెక్కు చెదరలేదు. అందులోనేఎడం వైపురాధా వాళ్ళు ఉండేవారు. రాధ పరుగులెత్తిన గచ్చు అరుగులు, రాధ బొట్లుపెట్టిన గడప, రాధ ముగ్గులుపెట్టిన మెట్లు... ఊహల్లో మాత్రం మిగిలిన గతంలా ఒక్కసారి కనిపించి కనుమరుగయిపోయాయి! ఏదో బాధ గుండెల్లోంచి గొంతులోకి పొంగి వచ్చింది. నీటి తెరలు మాధవరావు చూపులకి అడ్డువచ్చాయి. చటుక్కున చేరుమాటలకి కళ్లొత్తుకున్నాడు.

ఎవరో రిక్షా పక్కనుంచి వెడుతూ తొంగిచూసారు. వీధిలో ఆడుకుంటున్న పిల్లలు ఆటలాపి చూసారు. అరుగుల మీద కూర్చున్న ఆడవాళ్ళు కబుర్లాపి చూసారు. తనని వాళ్ళంతా చూస్తున్నారని చూసి ముడుచుకుపోయాడతను.

అదిగో!... ఆ సందులోనే తన తాత ముత్తాతలు కట్టించిన పెద్దరుగుల పెంకుటిల్లుంది. అక్కడికి వెళ్ళి 'నేను పుట్టి పెరిగిన ఇల్లిదే' అని తానిప్పుడంటే వాళ్ళు నవ్వరూ!

జీవితంలో ఏదయినా అంతే! చేతుల్లో ఉన్నంతవరకే తన స్వంతం. చేజారాక ఏదీ తనది కాదు. పెద్దవాళ్ళు ఇల్లు అమ్మేసారు... ఇప్పుడా యిల్లు తనది కాదు. పెద్దవాళ్ళు రాధనుండి తన్ను విడదీశారు. ఇపుడు రాధ తనది కాదు. రేపటి నుంచి మామిడితోట కూడా తనది కాదు... తన చేతులతో తానే దూరం చేసుకోవటానికి వచ్చాడిప్పుడు!

"దిగండి బాబూ!"అని రిక్షా వాడు హెచ్చరించే వరకు కామయ్య గారిల్లు వచ్చిందని కూడా అతను గుర్తించలేదు. రిక్షా వాడికి డబ్బులిచ్చేసి కామయ్యగారింటి ముంగిట్లోకి వచ్చి అక్కడ నిలబడ్డ పిల్లవాడ్ని అడిగాడు. "కామయ్యగారున్నారా బాబు!"

"తాతయ్యేనా? లేరు..."

ఇంతట్లో ముంగిట్లోకి వచ్చిన ముత్తయిదువ "ఎవరు బాబు?" అని కళ్ళు చికిలించి అడిగింది.

మాధవరావు ఆవిడ్ని గుర్తు పట్టాడు. కామయ్యగారి భార్య. "నేనే పిన్నిగారు! సుబ్బారాయుడు

గారి మనవడ్ని... మాధవూ అని పిల్చేవారు మీరు."

ఆవిడ ముఖమింత చేసుకుంది. "అరే, నువ్వా బాబు! చూపు తగ్గిపోయింది. గుర్తు పట్టలేకపోయా... రా బాబూ! అలా కూర్చో! మీ బాబయ్యగారికింకా ఊరమ్మట తిరిగే ఓపిక మిగిలుంది..." అని నవ్వి మంచినీళ్ళు తెమ్మని కోడలికో కేకపెట్టింది.

మాధవరావు కాళ్ళు కడుక్కుని మంచి నీళ్ళు త్రాగాక "... ఇవేళో రేపో నువ్వొస్తావని అనుకుంటున్నారు బాబూ!... ఒరేయ్ బాబిగా! పట్నం నుంచి మాధవరావుగారొచ్చారని మీ తాతయ్యతో చెప్పిరారా!" అని కుర్రవాడికి పురమాయించిందావిడ.

"మీ మామయ్య పోయాడని విని చాలా బాధపడ్డాం బాబూ!" అంది.

మాధవరావు తల దించుకున్నాడు.

"ఏమిటో... అనుకుంటాం కాని, అంతకన్న చిన్న వయస్సులో పాపం మీ నాన్న పోలేదూ? ఆయుష్షు లేకపోతే ఎవరయినా అంతే కదా!" అంటూ ఆవిడ ఎంతో సానుభూతి వెళ్ళబోసింది.

ఇంతలో కామయ్యగారు వచ్చారు. అతన్ని కుశల ప్రశ్నవేశారు. ఆ కబుర్లూ ఈ కబుర్లూ అయ్యాక "మరి తోట దాకా వెళ్ళొద్దామా?" అన్నారు.

అతని గుండె ఝల్లుమంది. బలవంతగా నవ్వు తెచ్చుకున్నాడు. "ఎందుకుండి? నేనింక చూసేదేముంది?"

కామయ్యగారు గాఢంగా నిట్టూర్చారు. "అంతేలే బాబూ! ఏది ఎంతవరకూ ప్రాప్తమో అంతే!... అయితే మరి వెంకన్నకి కబురు చేస్తాను."

మాధవరావు తల వూపాడు.

కామయ్యగారు ఎవరో కుర్రాడ్ని పిలిచి వెంకన్నకి కబురు చేసారు.

"అన్నట్టు చెప్పటం మరిచాను... అమధ్య రాదమ్మ వచ్చిందోయ్!" అన్నాడు కామయ్యగారు ముఖమింత చేసుకొని.

ఉలిక్కిపడ్డాడు మాధవరావు. "ఎవరండి?" అన్నాడు తడబడుతూ.

"అరే.. మర్చిపోయావా? బుచ్చిబాబు గారింట్లో ఉండేవారు... శాంతమ్మా వాళ్ళు... వాళ్ళమ్మాయి రాధ. అస్తమానం మీ యింటికి వస్తూండేది. వారం వారం మీతో పాటు శివాలయానికి వచ్చేది. గుర్తుకు రాలేదూ?"

"ఆc!... ఆ!c గుర్తొచ్చిందండి!.." గుర్తుకు రాకపోవటానికి తను ఎప్పుడు మర్చిపోయాడు కనుక! కాని, ఎందుకు వచ్చింది? ఏమంది? తన గురించి ఏమయినా అడిగిందా?... ఈ ప్రశ్నలు ఎలా అడిగేది? ఏ ముఖం పెట్టుకొని అడిగేది?.. అతని మనస్సు పిండిపట్టినట్టయింది!

"ఈ వూరి దగ్గర్లో వాళ్ళ బస్సు పాడయిందిట. పోనీ, చిన్నప్పుడు ఉన్న వూరు కదాని చూద్దామని వచ్చిందిట. చాలామంచి పిల్ల! ఈనాటిక్కూడా మనమన్నా మనూరన్నా ఎంత గుర్తునుకున్నావు? పేరు పేరునా అడిగింది! మీ చెల్లెలు శారద గురించి, మీ అక్కయ్య కాత్యాయిని గురించి... నిన్న మొన్న కల్సుకున్నట్టు మాట్లాడింది..... ఆఖరికి మీ మామిడితోట

గురించి కూడా అడిగింది!" అని గలగల నవ్వింది కామయ్య గారి భార్య.

అవును. రాధ 'మామిడితోట' నెలా మర్చిపోగలదు?.... ఒకటా రెండా? పదేళ్ళ పాటు ఆ తోటల్లో తిరిగారు. తమ చేత్తో నాటిన మొక్కలు... తమ కళ్ళ ముందే ఇంతై ఇంతింతై తమ ప్రేమలాగే పెరిగి పెద్దవయ్యాయి. వాటి చల్లని నీడల్లో రానున్న కాలం గురించి తామెన్నో ఊసులాడుకున్నారు. పండించుకుందామనుకున్న కలల గురించి తామెన్నో బాసలు చేసుకున్నారు. కాని, విధి వక్రించింది. తమ తియ్యటి కలలన్నీ చెదిరిపోయాయి. వచ్చిన కాలం జీవితాల మీద చేదు ముద్రలు వేసి వెళ్ళిపోయింది!

"అదేమిటి బాబూ అలా అయిపోయావు?" అన్నారు కామయ్యగారు.

"అబ్బే, ఏం లేదండి.. చెప్పండి.. రాధ గురించి చెపుతున్నారు కదూ! ఇంకా ఏమడిగిదండి?" అన్నాడు ఉద్వేగాన్ని అణుచుకుంటూ.

"ఎప్పుడయినా నువ్వు తోట చూసుకోటానికి వస్తున్నావా అని అడిగింది."

చెంప పెట్టు పెట్టినట్టయింది మాధవరావుకి.

".. .ఎక్కడో పట్నంలో ఉద్యోగం చేసుకుంటున్నవాడి. నీకంత తీరిక లేదని పాపం ఆ అమ్మాయికి తెలియదు. ఇన్నాళ్ళూ మీ మామయ్య వచ్చి పంట డబ్బు తీసుకువెడుతున్నాడని చెప్పాను. ఏదో నాడు నువ్వు తప్పకుండా వస్తావని తోట చూసుకుంటావని చెప్పింది. నీకా తోటంటే చాలా యిష్టమని చెప్పింది. కాని.."

"... నేనీ వేళ ఆ తోట అమ్ముకోటానికి వచ్చాను!' అన్నాడు మాదవరావు తల దించుకుని.

కామయ్యగారి మనస్సు ద్రవించింది. "బాధపడకు బాబూ! నువ్వు మాత్రం సరదా ఖర్చులకి అమ్ముకుంటున్నావా? ఈ రోజుల్లో ఏదోటి అమ్ముకోందే ఏ తండ్రి కూతురు పెళ్ళి చేయగలుగుతున్నాడు?.. మధ్య తరగతివాళ్ళ బ్రతుకులన్నీ ఒక్కలాగునే ఉన్నాయి.."

"... మళ్ళీ ఆ తోట కొనాలంటే ఈ జీవితంలో నావల్లవుతుందా?" తనలో తను అనుకున్నట్టు అన్నాడు.

కామయ్యగారికేమనటానికీ పాలుపోలేదు. వాళ్ళ మధ్య కాలం స్తంభించినట్టయింది.

మరికాసేపటికి తోట కవులుదారు వెంకన్న వచ్చాడు. ఎప్పుడో నూనూగు మీసాల మాధవరావుని చూసాడు. చెంపలు నెరుస్తున్న మాధవరావుని చూడటం అతని కిప్పుడు బాధే అనిపించింది. "బాబు పెద్దోడయిపోయాడు!" అన్నాడు.

ఎవరి నవ్వులోనూ జీవం లేదు.

ఆ మాటా ఈ మాటా అయ్యాక "మరయితే తోట అమ్మక తప్పదా బాబూ!". అన్నాడు వెంకన్న.

కామయ్యగారు బలవంతంగా నవ్వారు. "పోనీ, నువ్వో పదివేలు అప్పెట్టరా! తర్వాత పంట సొమ్ములో వాయిదాలుగా చెల్లు పెట్టుకుందుగాని..."

"అంత డబ్బు నాకాడుంటే ఇయేల తోట మరోరికి పోనిత్తానా అయ్యా! ఇన్నేల్లు అయ్యకి

నా మీన నమ్మిక్కుదిర్నాది. పంట సేస్కుపోతున్నా! రేపుఎవారొత్తారో - ఏవంటారో!..."

"పిచ్చివాడా! ఈ జీవితంలో ఏదీ శాశ్వతం కాదురా! మనమంతా ఆ పైనున్నాడే.... వాడి చేతిలో బొమ్మలం. ఎలా ఆడిస్తే అలా ఆడాల్సిందే!.... అబ్బాయికీ నీకే కాదు. నాకూ బాధగానే వుంది. అయినా, మనకీ బాధ తప్పదు.... వెళ్ళి ప్రొద్దున్నే బేరగాళ్ళని వెంట బెట్టుకురా!...."

నోరు విప్పలేక తలవూపి వాళ్ళకి దండం పెట్టి వెళ్ళిపోయాడు వెంకన్న.

ఆ రాత్రి అన్నం సయించలేదు మాధవరావుకి. అతని మనస్సులోని బాధ నర్థం చేసుకున్న కామయ్యగారు వత్తిడి చేయలేదు.

ఆ రాత్రి ఎంతసేపటికీ అతనికి నిద్రపట్టలేదు. వీధిలో మసక వెన్నెల పడుతోంది. ఆ వెలుగులో ఎన్నో చిత్రాలు రూపుకట్టి కనిపించాయి. అతను ఇరవయ్యేళ్ళుగా వెళ్ళి చూడని మామిడి తోటలోకి అతని మనస్సు గాలిలో తేలిపోతూ వెళ్ళింది.

'.... ఇక్కడే ఈ తోటలోనే ఒక చిన్న యిల్లు కట్టుకుంటే ఎంత బావుంటుంది?' అని రాధ.

'అవును. పెళ్ళి చేసుకొని అందులోనే చిలకా గోరింకల్లా కాపురముంటే ఇంకా బావుంటుంది!' అని తను.

'ఊఁ'

'నువ్వలా అంటే ఆ మావిమీద కోయిల కుహూ - అన్నట్టుంది!'

'ఇన్ని కబుర్లు ఎక్కడ నేర్చావు?'

'ఇక్కడే... మావితోటలోని చిన్నదాని దగ్గర!'

'అబ్బ. నీ మాటల్లో ఎంత మత్తు!'

'నీ చూపుల్లాగే!'

'అబ్బ. చక్కిలిగింతలు.... ఎవరయినా చూస్తారు.'

'అదిగో గండు కోయిలచూసి పరవశించి పాడుతోంది....'

ఇలా ఎన్నని! ఎన్ని కబుర్లని! అవన్నీ ఇంతకు ముందే అనుకున్నట్టు... ఇప్పుడిప్పుడే తనకు రాధకు మధ్య జరిగినట్టు గుర్తుకు వస్తున్నాయి! ఇంతకాలం... ఇన్నేళ్ళు గడిచినా ఆ స్మృతులకెంత శక్తి ఉంది! రాధ ప్రేమ కెంత బలముంది?

తను రాధని చేసుకొనుంటే? ప్రస్తుతం తను పడుతున్న బాధ ఉండేది కాదేమో? తనకున్న సమస్యలెంత జటిలమయినా తనకి అశాంతి ఉండేది కాదేమో?

రాధని తప్ప మరెవర్నీ పెళ్ళాడనని అప్పుడు తానెంత మొండికేసాడు!

'.....తన కూతుర్ని నువ్వు చేసుకోకపోతే నీ చెల్లల్కి పెళ్ళి చెయ్యాల్సిన బాధ్యత మీ మామయ్య కెక్కడుంటుంది....' అని తల్లి పోరింది.

'చెల్లెలు పెళ్ళి నా కష్టార్జితం మీద చేస్తానమ్మా!' అని తనూ వాదించాడు.

'నీ కెప్పటికి ఉద్యోగం వస్తుంది? ఎప్పటికి సంపాదించి దాని పెళ్ళి చేస్తావు? అంతవరకు దాని వయస్సు అలాగే ఆగి వుంటుందా? ఎవరో పరాయి ఆడపిల్ల కోసం నువ్వింత హైరాన పడిపోతున్నావొరే.... ఇక్కడ తల్లి బాధ, చెల్లెలి బాధ, నీ మీద మనసు పెట్టుకున్న మరదలి బాధ ఇంతమంది బాధల్ని అర్థం చేసుకోలేవా? ఒక్క పరాయి మనిషి కోసం ఇంతమంది అయిన వాళ్ళని బాధ పెట్టడం నీకు భావ్యమేనా?' అని ఆవిడ ఏడ్చి మొత్తుకుంది.

అప్పటికీ తన మనస్సు మారింది కాదు. రాధ తనకు పరాయిదని తల్లి అన్నకొద్దీ తనకు దగ్గరయినట్టు అనుకొనేవాడు... ఆమెనే పెళ్ళాడాలన్న కోరిక బలపడేది.

కాని, తనకు కాలం కలసి రాలేదు. మామయ్య రికమండేషన్ ఇప్పిస్తే కాని తనకు ఉద్యోగం దొరకలేదు. మామయ్య సాయం చేస్తేకాని తర్వాత తన చెల్లెలు శారద పెళ్ళి కాలేదు. అలాంటి మామయ్య ఋణభారం, కన్నవాళ్ళకు 'రాధ' మీద పెరుగుతున్న ఏహ్యాభావాన్ని భరించలేకపోయాడు.

అంతమందిని కాదని రాధను చేసుకుంటే ఆమె మాత్రం సుఖపడుతుందా? తన మూలంగా భర్త ఇందర్కి శత్రువయ్యాడని వింటే ఏ ఆడది భరించగలదు! కనీసం ఆమెకయినా సుఖ శాంతులు దక్కనప్పుడు ఆ పెళ్ళివల్ల ప్రయోజనమేముంది? తన మూలానే కదా ఆమెనంత ఘోరంగా తనవాళ్ళు శపిస్తున్నారు. తన్నికాక మరెవర్ని చేసుకున్నా ఆమె సుఖపడుతుందేమో! అని అనుకున్నాడప్పుడు.

తన గుండెలోని ప్రేమని భగ్నం చేసి తన్ను ప్రేమించిన రాధ మనస్సులో సునాయాసంగా చిచ్చు ముట్టించగలిగిన పెద్దవాళ్ళు.... తన్ను పెళ్ళాడిన దాని మనసులో ఎంత శ్రమపడినా మమతానురాగాన్ని పుట్టించలేక పోయారు. అవి లేకపోతే పోయె.... కనీసం కుటుంబ గౌరవమే తన గౌరవమన్న ఇంగితజ్ఞానం కూడా లేదామెకు. ఎప్పుడో వేళాకోళానికి 'మా అన్నయ్య రాధను చేసుకుందామనుకున్నాడు - నీలాంటి గయ్యాళిని కాదు' అన్న శారద మాటలు పట్టుకొని నిత్యం సూదుల్లాంటి మాటలతో తన గుండెల్లో గ్రుచ్చుతుంది. నోరు విప్పితేచాలు - 'నన్నెందుకు చేసుకున్నారు. ఆ మహారాణినే చేసుకోకపోయారా? ప్రేమగా చూసుకొనేది....' అని గొంతు చించుకుంటుంది. రాత్రి ఏ పనివల్లయినా ఆలశ్యంగా రావటం భయం. "ఇప్పటికి రాధాదేవిగారి సేవ అయింది కాబోలు!" అంటూంది. రెండు చేతులూ కలిస్తేనే చప్పుడని.... తనే నోరు మూసుకుంటున్నాడు. అయినా, అదీ తప్పే అయింది. ఏ తప్పూ లేందే ఎవరయినా మాట పడతారేమిటి అని దెప్పిపొడుస్తుంది. ఇంట్లో ఎన్నునుకున్నా తను సరిపెట్టుకుపోయుండేవాడు. కాని, తనని వీధినకూడా పడేస్తోంది. పరాయివాళ్ళతో తన భర్త గురించి నీచంగా చెప్పుకుంటే తనకే సిగ్గుచేటని ఆమెకు తోచదు.... తన మనస్సులోంచి రాధను తప్పించి తానా స్థానంలో నిలువవల్సినదానికి బదులు మూర్ఖంగా తన్ను మాటలతో హింసించి ఆ రాధని దూషిస్తోంది. తన మనస్సులో రాధ ఈనాటికీ నిల్చి ఉండటానికి కారకురాలవుతోంది.

ఒక్కనాడు కాదు... ఒక్క యేడు కాదు... ఇరవయ్యేళ్ళుగా విరామం లేకుండా నోరు పారేసుకుంటోంది. విని విని పొరుగు వాళ్ళకయినా విసుగు పుట్టిందేమో కాని ఆమె పోరుకి అంతంటూ కనిపించటంలేదు. రాధ తన భార్య అయివుంటే ఎప్పటికీ ఇలా జరిగేది కాదు. తను తిన్నా తినకపోయినా రాధ ఇలా తనకు గుండె కోత పెట్టేది కాదు. తనకేమీ పెట్టలేకపోయినా వచ్చిననాడే వస్తుంది - అని ధైర్యం చెప్పేదే కాని, ఏమీ పెట్టలేదని సాధిం చేది కాదు. తన స్థితిగతులకి తన దురదృష్టమనేదేమో కాని - భర్త దౌర్భాగ్యమేనని ఎన్నటికీ అనేది కాదు. అంతస్తుకి మించి కూతురుకి పెళ్ళి చేయాలనుకునేది కాదు. ఈనాటికీ మాత్రం ఆధారంగా ఉన్న మామిడితోటని అమ్మాలనుకొనేది కాదు. ఈరోజు పండగలా గడిస్తే చాలు రేపటిరోజు రేపు చూసుకుందామని మూర్ఖంగా ఎప్పుడూ మాట్లాడి ఉండేది కాదు.

కాని, తన భార్య రాధ కాదు. రాధ మంచితనంలో వందోవంతు కూడా ఆమెకు లేదు. అందుకే తను నిత్యనరకం అనుభవిస్తున్నాడు. పెళ్ళి చేసుకుంటే తనవల్ల రాధకి తన వాళ్ళ శాపాలు తగులుతాయని భయపడ్డాడప్పుడు. ఆమెను పెళ్ళాడకపోయినా రాధకి శాపాలు తప్పటం లేదు ఇప్పటికీ!

నిజంగా తానెంత తప్పు చేసాడో ఇప్పుడు తెల్సి వస్తోంది. తన జీవితం చేజేతులా నాశనం చేసుకున్నాడు.

ఇల్లు విడిచి వచ్చినప్పుడయినా తన మనస్సుకి విశ్రాంతి లేకుండా పోయింది. ఈ వూరు, చిన్ననాటి అనుభవాలు రాధతోటి ముచ్చట్లు ఈ స్మృతులు కూడా తన మనస్సుని సేద తీర్చలేకపోయాయి. పోనీ మామిడితోటకి ఒక్కసారి వెడితే మనస్సుకి కొంచెమయినా ఉపశాంతి దక్కుతుందేమో! కొన్ని గంటల తర్వాత ఇక ఆ తోట ఎలాగా తనది కాదు.

తెల్లవారిన వెంటనే తోట కొకసారి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు అతను. ఆ తర్వాత ఎప్పుడో మాగన్నుగా నిద్ర పట్టింది.

కామయ్యగారి మాటలు వినిపించి మెలకువ వచ్చింది అతనికి. గబగబా లేచి కాల కృత్యాలు తీర్చుకున్నాడు. స్నానం చేసి బట్టలు మార్చుకొని కాఫీ తాగాడు.

"గుడికి వెళ్ళొద్దామా మాధవూ?" అని అడిగారు కామయ్యగారు.

ఒకక్షణం తటపటాయించి - "ఒక్కసారి తోట చూసి రావాలని వుంది బాబాయ్!" అన్నాడు.

ఆయన జాలిగా చూసారు."దారి గుర్తుందా?.... ఎవర్నయినా పంపనా?"

"వెళ్ళగలనులెండి." అని ఆయన మరో మాట మాట్లాడ్డానికి ముందే బయలు దేరాడతను. ఎవర్నీ అడగవల్సిన అవసరమే రాలేదు. అతని కాళ్ళే అతన్ని తోటదాకా తీసుకు వెళ్ళాయి. చిన్ననాటి స్మృతులకున్న బలం అంతటిది!

ఎవరో పరుగులు పెట్టినట్టు ఎండుటాకులు గలగల చప్పుడయ్యాయి. రాధ కాదు కదా?.... అతని గుండె ఝల్లుమంది. క్షణం నిలబడి చుట్టూ చూసాడు.... ఉడుతల క్రీడలు!

ఎవరో సున్నితంగా నవ్విన సవ్వడి. ఒళ్ళు గరిపొడిచి మళ్ళీ ఆగాడు.... కొమ్మల గుబుర్లో కూర్చున్న పిట్టల కువకువలు!

ఎంతో పరిచయమున్నట్టు అతని కాళ్ళు తోట మధ్యకి దారితీసాయి... అవే! రాధ-తనూ నాటిన చెట్లు అవే!

పదిగజాల దూరంలోకి వచ్చేసరికి అతనికి గుండెలు దడదడలాడాయి. ముచ్చెమటలు పోసాయి. చెట్లను చూసినందుక్కాదు.... ఆ చెట్లమీద చెక్కిన పేర్లు చెక్కు చెదరకుండా ఉన్నందుకు!

ఆ చెట్టుమీద తను చెక్కిన పేరు 'రాధ' ఈ చెట్టు మీద రాధ చెక్కిన 'మాధవ్.'

ఒక్కటి కాదు... రెండు కాదు... పాతికేళ్ళ క్రితం చెక్కిన పేర్లు! కొన్ని గంటల క్రితం చెక్కినట్టు ఎంత చక్కగా వున్నాయి! ఎంత కళకళలాడుతున్నాయి!

వణికే కాళ్ళని నిలద్రొక్కుకొని దగ్గరికి వెళ్ళాడు. చెట్టుమీద ఉన్న 'రాధ' పేరుని వ్రేళ్ళతో తడిమాడు. అతనివొళ్ళు పులకరించింది. కళ్ళల్లోకి నీళ్ళు చింది వచ్చాయి. 'రాధా!' 'రాధా!' అని గొణుక్కున్నాడు.... అటు చూసాడు. ఆ చెట్టు దగ్గర వయ్యారంగా మునివ్రేళ్ళమీద కూర్చుని చిన్నారి రాధ 'మాధవ్' పేరు చెక్కుతున్నట్టే అనిపించింది. గబగబా అటు అడుగులు వేశాడు. 'మాధవ్' పేరు సరిగా కనపడలేదు. అతనికి కన్నీటిపొరలడ్డు వచ్చాయి. చటుక్కున చేరుమాలుకి కళ్ళొత్తుకున్నాడు...

"ఎవరు బాబుగారూ?" అన్న మాటలకి ఉలిక్కిపడ్డాడు. స్పృహలోకి వచ్చి వెనక్కి తిరిగాడు.

పది పన్నెండేళ్ళ పల్లె పడుచు. చితుకులేరుకొనే బుట్టతో నిలబడి వుంది. అతని వైపు కళ్ళింత చేసుకొని చూస్తోంది.

గొంతులో సుడులు తిరుగుతున్న ఆవేదన అతని గొంతు పెగలనివ్వలేదు.

"పేర్లు సదువుతున్నారా?" అని లేతగా నవ్వింది ఆ పిల్ల. పగలే వెన్నెల కురిసినట్టయింది.

మాధవరావు తలవూపి "ఎవరు చెక్కారు?" అని అడిగాడు.

"అబ్బో. ఇప్పుడేటి ఎప్పుడో నే పుట్టక్కితం... మాయమ్మ నాయంతున్నప్పుడు సెక్కినారంట. ఈయమ్మ ఆ అయ్యపేరు, ఆ అయ్య ఈయమ్మపేరు సెక్కినారంట. ఈ తోట ఆ అయ్యదే! ఆ అయ్యన్నే నెప్పుడూ సూడ్నేదు కాని.... ఈయమ్మను సానాసార్లు సూత్తూనే ఉన్నా!...."

అతను నిర్ఘాంతబోయాడు. "ఎక్కడ? ఎక్కడ చూస్తున్నావు?" అని కంగారుగా అడిగాడు.

అతనివైపు చిత్రంగా చూసిందాపిల్ల. "ఈడనే.... ఈ సెట్లకాడనే సూత్తున్నానయ్యా! ఆయమ్మ పేతేడు కాపుకాలంతో వస్తది.... కాపు కాలమన్నాని కాయలు కోస్కోటానిక్కాదు. అదేమో నాకు తెల్దు. ఆయమ్మొచ్చేతలికి ఈ సెట్లనిండ కాయలిరగబడిపోతాయి' కొమ్మలిరిగిపోయేన్ని కాయలు. ఈ సెట్టు కాయేటి - ఆ సెట్టు కాయోటి ఆ యమ్మ కోసుకెల్తది. ఈడనే కూకుంటది. అట్టా సెట్లకేసి సూత్తూకూకుంటది. ఆయమ్మ అలా కూకుంటే ఎంతో సిత్రంగా ఉంటది. కూకొని కూకొని ఎల్లిపోతది. ఎల్లిపోయేటప్పుడు నాకో రూపాయిత్తుందాయమ్మ. ఒద్దన్నా

యినుకోదు. మాయమ్మ కాయమ్మ బాగా తెల్సునంట. నే పుట్టక్కితం మాయమ్మకి అలాగే యిచ్చేదంట.... మాయమ్మ తోసినప్పుడల్లా ఈ పేర్లమీద మళ్లీ మళ్లీ సెక్కేదంట... ఇప్పుడు నానూ సెక్కుతుంటాను.... నిన్న సందెకాడే సెక్కాను. బావున్నయ్యా?..." ఆ పిల్ల అమాయకంగా నవ్వి అడిగింది.

నోటమాట రాక తల వూపాడతను.

ఈ జీవితంలో ఏదీ శాశ్వతం కాదన్నారు. బాబాయి. అది నిజంకాదు! ఇరవయ్యేళ్ళ క్రితం శివాలయంలో బాబాయి దీపారాధన చేసేవారు. గుడిగంటలు మ్రోయించేవారు. ఇప్పుడాయన స్థానంలో ఆయన కొడుకు నిత్య దీపారాధన చేస్తున్నాడు. గుడిగంటలు అవిరామంగా మ్రోగుతూనే ఉన్నాయి!

అలాగే మామిడితోటలో రాధా మాధవుల పేర్లు మాసిపోలేదు. ఒకప్పుడు మాణిక్యం చెక్కింది. ఇప్పుడామె కూతురు చెక్కుతోంది.... రాధ ప్రేమ కలకాలం నిలిచేది!... ఎన్నటికీ తరగనిది. కరగనిది!

ఆమె – తన గుడిలో నిత్య ఆరాధన జరుగుతోందని తెల్సుకొని ముగ్ధురాలవుతున్న దేవత. ఆమె – స్వయంగా వచ్చి పావనం చేస్తున్న స్థలం ఇది. ఇక్కడ తనకు అడుగు పెట్టే అర్హత కూడా లేదు.

కన్నది విన్నది అతని గుండె కుదుళ్ళని కదలిస్తోంది. పెదవి కదిపితే దుఃఖం పొంగి వచ్చేలా వుంది!

"కాని, ఆ అయ్య పట్టం నుంచొచ్చారంట! తోట అమ్మేత్తారంట! రేత్రి తాత అమ్మతో సెపుతుంటే యిన్నాను. ఇంకీ తోట మాకుంటదో నేదో! మళ్లీ కాపు కాలాని కాయమ్మ ఒస్తే...."

ఇంక అక్కడ నిలబడటం అతని శక్యం కాలేదు. గిరుక్కున వెనక్కి తిరిగి గబగబ ఊరువైపు అడుగులు వేసాడు.

"ఎల్లిపోతున్నారేటయ్యా!" ఆ పిల్ల వెనక పరిగెత్తుకొస్తున్నా అతను వినిపించుకోలేదు.

చెమటలు కక్కుతూ వచ్చిన మాధవరావుని చూసి "నువ్వొక్కడవే వచ్చావేమిటి బాబూ! వెంకన్న బేరగాళ్ళని తీసుకొని తోటవేపే వచ్చాడుగా! మరి నీక్కనపడలేదూ?" అని అడిగాడు కామయ్యగారు.

అతనామాటే వినిపించుకున్నట్లు లేదు. గబగబా లోపలికి వెళ్ళి తన చేతిసంచీ తెచ్చుకున్నాడు. "మీకీ శ్రమ యిచ్చినందుకు నన్ను క్షమించండి బాబాయ్! నేను మామిడి తోట అమ్మను. నాకమ్మాలని లేదు. వెంకన్న వస్తే చెప్పేయండి!"

కామయ్యగారింకా గుక్క తిప్పుకోనేలేదు. ఆయన భార్య నోరు విప్పనే లేదు – మాధవరావు వడివడిగా బస్టాండువైపు అడుగులు వేసాడు.

•